ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- గ్రామ పంచాయతీల బలోపేతానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారం కల్పించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.
- పరీక్షల్లో విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు పరీక్షా పే చర్చా కార్యక్రమం దోహదపడుతుందని చిత్తూరుజిల్లా సమగ్రశిక్ష అదనపు అధికారి ఎం.వెంకటరమణ తెలిపారు.
- సుస్థిరాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బిజేపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.

==================

సుస్థిరాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఎన్డీఏతోనే సాధ్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిన సందర్భముగా ఆమె ఈరోజు విశాఖలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఢిల్లీ ఎన్నికల విజయం సమిష్టికృషితోనే సాధ్యమైందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలందరి మన్ననలను పొందిందని, రాష్ట్ర భవిష్యత్తుకు ఎన్డీఏ కూటమి కట్టుబడి వుందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ, స్టీల్ ప్లాంట్ ను లాభాల బాటలో నడిపించడానికి కేంద్రం అన్ని విధాలా కృషి చేస్తోందని పేర్కొంటూ..

(వాయిస్ బైట్..36 సెకన్లు)-సెట్

==================

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే గ్రామ పంచాయతీ వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. అందులో భాగంగానే గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారం కల్పించిందని ఓ ప్రకటనలో పేర్కొనారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా పంచాయతీలకు నిధులు విడుదల చేసిందని, ఆ నిధులను సద్వినియోగం చేసుకుని, పశ్చిమ గోదావరి జిల్లాలో విస్సా కోడేరు గ్రామం ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేసిన విస్సా కోడేరు పంచాయతీని, గ్రామ ప్రజలందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు పవన్ చెప్పారు. అలాగే ఈ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన జిల్లా పంచాయతీ రాజ్, నీటి సరఫరా శాఖ అధికారులకు, పవన్ కల్యాణ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

==================

పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నతంగా రాణించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పరీక్షా పే చర్చా కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని చిత్తూరుజిల్లా సమగ్రశిక్ష అదనపు అధికారి ఎం.వెంకటరమణ తెలిపారు. చిత్తూరులో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రధానమంత్రి నిర్వహించే పరీక్షా పే చర్చా

కార్యక్రమాన్ని విద్యార్థులు తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు.

===================

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు విజయవాడలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు 25 లక్షల రూపాయల మేర వైద్య సహాయాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. రాష్ట్ర బడ్జెట్ లో వైద్యానికి 6.5 శాతం నిధులు పెంచి 18వేల 500 కోట్లు కేటాయించారన్నారు. 4 కోట్ల మంది ప్రజలకు క్యాన్సర్ నివారణ, ఉచిత వైద్య సేవలు, ప్రభుత్వాసుపత్రులలో అందుతున్నాయన్నారు. గుండె జబ్బులకు 45 వేల రూపాయల ఇంజక్షన్‌ను రాష్ట్రంలోని అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రభుత్వం ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తుందని ఆయన తెలియజేశారు.

===================

విరామం

===================

రాష్ట్రంలోని ఇరిగేషన్ శాఖలో అత్యవసర పనులలో భాగంగా 320 కోట్ల రూపాయల నిధులతో గోదావరి గట్ల పనులను చేపట్టినట్లు జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్లలో గోదావరి వరద గేట్లు పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈసందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏటిగట్లను బలోపేతం చేయడం, డ్రైన్ల పూడిక తొలగించడం, గేట్లు, షట్టర్లు, లాకులు వంటి అత్యవసర పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేస్తామన్నారు. ఇరిగేషన్ శాఖలో 12 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల ప్రమోషన్లకు ఆమోదముద్ర వేస్తూ ఉద్యోగుల గౌరవాన్ని కాపాడుతున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్..33 సెకన్లు)

===================

కార్మికులను నిర్బంధించి పనిచేయించటం చట్టరీత్యా నేరమని శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై. శైలేష్ కుమార్ అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈరోజు శ్రీకాకుళంలో ర్యాలీ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలేష్ కుమార్ మాట్లాడుతూ, నిర్ణీత పని గంటల తర్వాత కార్మికులు స్వేచ్ఛగా తమకు నచ్చిన చోట జీవించే హక్కుందని తెలిపారు. డబ్బులు కానీ, మరే ఇతర రకాల బకాయిలు ఉన్నాయని కార్మికుల్ని నిర్బంధించి పనిచేయించటం నేరమన్నారు. ఈ సందర్భంగా జిల్లాను వెట్టి చాకిరి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు కలిసి సమిష్టిగా పని చేస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

===================

ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీఎస్) సభ్యులకు ప్రస్తుతం రోజువారీగా అందిస్తున్న వీఐపీ బ్రేక్ దర్శన కోటాను 50 నుంచి వందకు పెంచుతూ శ్రీవారి ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎం.లోకనాథం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీన లేఖ రాస్తూ కోటా పెంచాలని విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే ప్రవాస భారతీయులు, విదేశీయులకు సుపథం మార్గంలో సులువుగా దర్శనం కల్పించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. దేశానికి వచ్చినప్పుడు విమానాశ్రయంలో వేసే స్టాంపింగ్ తేదీ నుంచి నెలలోపు దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది.

===================

రేపు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మాత్రల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమీషనర్ జి. వీరపాండ్యన్ ఒక ప్రకటనలో తెలిపారు. నులిపురుగుల నిర్మూలనలో భాగంగా 1 నుండి 19 ఏళ్ల మధ్య వయస్సు గల చిన్నారులు, విద్యార్థులకు అల్బెండజాల్ మాత్రల్ని ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపిణీ చేశామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1కోటి 12 లక్షల మంది చిన్నారులకు మాత్రల పంపిణీ లక్ష్యంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించామని, రేపటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు ఈ మాత్రల్ని అందజేస్తామన్నారు.

===================

దిగువ ట్రోపో ఆవరణములో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈశాన్య దిశగా, దక్షిణ కోస్తా, ఆంధ్రప్రదేశ్, రాయలసీమలో తూర్పు ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ విభాగం పేర్కొంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణముగా కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని తెలియజేసింది.

===================

రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలపై కలెక్టర్ ఈరోజు సంబంధిత అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ, గతంలోని అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ముఖ్యంగా గిరి శిఖర ప్రాంతాల్లోని సమస్యను ఎదుర్కోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

===================
===================